క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ

కదిరి అర్బన్: వీవర్స్‌కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 750 మంది విద్యార్థులకు అమెరికాలో స్థిరపడిన సాయిబాబాభక్తులు మమత భరూచ,నవనీత్ భరూచ,ప్రతీక్షా గాంబెల్, బక్కరీ గాంబెల్‌లు పంపిణీ చేశారు. ఈ కిట్‌లో జామెట్రీబాక్స్, రైటింగ్‌ప్యాడ్, స్కేల్ పెన్సిల్,ఎరైజర్,షార్ప్‌నర్‌లు ఉన్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదాపీర్,కౌన్సిలర్‌లు గిరిజమ్మ,బొబ్బిలి రవి,ఓం ప్రకాష్,అమీర్ చంద్రమోహన్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కవిత పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల చైర్మన్ సయ్యద్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు చాంద్‌బాషా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: నసనకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లను ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సరళ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు చదువు భారంకాకూడదని జగనన్న విద్యాకానుక ద్వారా నోట్‌బుక్స్ , బ్యాగ్స్, యూనిఫాం, షూస్ అందించారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని మల్లాకాలువ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంపీటీసీ హనుమంతరెడ్డి చేతుల మీదుగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

పుట్టపర్తి టౌన్: ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదవాలి, ఉజ్వల భవిష్యత్ పొందాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం బుక్కపట్నం మండల కేంద్రంలో పూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బషీరున్నీషా తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం

ఎన్‌పీకుంట: ఎన్‌పీ కుంట–2 సచివాలయం పరిధిలోని రెడ్డివారిపల్లి, చినసానివారిపల్లి, చీమలచెరువుపల్లి తో పాటు మండల కేంద్రంలోని పెడబల్లి బజారులో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటెరాము, ఎంపీడీఓ ఆదినారాయణ సోమవారం తెలిపారు. ఉదయం 7గంటలకు రెడ్డివారిపల్లి నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

నల్లమాడ: నల్లమాడ–2 సచివాలయం పరిధిలోని అరవవాండ్లపల్లి తండా, బాసంవారిపల్లి, ఎన్.బడవాండ్లపల్లి, అప్పయ్యగారిపల్లి, పెమనకుంటపల్లి, పీకేపీ తండా, చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

నేడు అద్దె షెడ్ల వేలం

తలుపుల: మండల కేంద్రంలోని పంచాయతీ ఆఫీస్ పక్కనున్న కూరగాయల మార్కెట్‌లో 6 గదులు నెలవారి అద్దెకు మంగళవారం వేలం వేమనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్, ఎంపీపీ రఫినాయక్ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తి, జనార్దన్, ఆదిబయన్న, ఎంఈఓలు చెన్నకృష్ణ, లలితమ్మ, జాన్‌రెడ్డెప్ప పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం

నల్లచెరువు: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి జెడ్పీటీసీ అనిత భర్త విశ్వనాథ్‌రెడ్డి సోమవారం రూ. 20 వేలు విరాళాన్ని అందజేశారు. రామాలయానికి ఆర్థిక చేయూతను అందించిన విశ్వనాథ్‌రెడ్డిని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు అభినందించారు.




బత్తలపల్లి: దంపెట్ల చెన్నకేశవాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు, ధర్మవరం: అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి



పుట్టపర్తిటౌన్: వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా వెళ్తున్న భక్తులు



ధర్మవరం: కొత్తపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల జనసందోహం

ముక్కోటి వైభవం

ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో ముక్కోటి ఏకాదశిని అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ముఖ్యంగా వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉత్తర ద్వారం ద్వారా ఆయా ఆలయాల్లో స్వాములను దర్శించి పులకించిపోయారు. ప్రత్యేక అలంకరణల్లో ఆలయాలు ముస్తాబు కాగా విశేష అలంకరణలతో స్వామివార్లు కనువిందు చేశారు. రోజంతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి బృందం

- వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు
- పులకించిన భక్తజనం

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకర్‌నారాయణ కుటుంబ సమేతంగా చెన్నకేశవస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్‌లు యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు స్వామిని దర్శించుకున్నారు. రాత్రి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తపేటలోని వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

బత్తలపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోట్లమర్రి ఆంజనేయస్వామి, శివాలయం, ముష్ఠూరు శివాలయం, ఆంజనేయ స్వామి, గంటాపురం అప్పస్వామి, సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరుని క్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, జ్వాలాపురం లక్ష్మీనరసింహ దేవాలయం, రామాపురం, మాల్యవంతం వీరనారాయణస్వామి దేవాలయాలు భక్తులు పోటెత్తారు. దంపెట్లలో యువత ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం.. సకల పాపాలహరణం

పుట్టపర్తిటౌన్: పుట్టపర్తి పట్టణంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలి వచ్చి పూజలు చేపట్టారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలో ప్రవేశించి దేవున్ని దర్శించుకున్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం, వేణు గోపాలస్వామి ఆలయం, గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ప్రశాంతినిలయం ఉత్తరద్వారా పెద్దఎత్తున భక్తులు ప్రవేశించి సత్యసాయి మహాసమాధి, వినాయకున్ని దర్శించుకున్నారు.

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో సోమవారం ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

ఓడీ చెరువు: వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని వంచిరెడ్డిపల్లిలోని శ్రీహరిహర నందీశ్వరాలయం, గౌనిపల్లిలోని రామాలయం భక్తులతో కిటకిటలాడాయి.

అమడగూరు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం జేకేపల్లిలోని షిరిడీసాయిబాబా ఆలయంలో, హరిపురంలోని కోదండ రామస్వామి ఆలయల్లో ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. అలాగే అమడగూరులో చౌడేశ్వరీ ఆలయానికి కర్ణాటక భక్తులు ఎక్కువగా హాజరై పూజలు చేశారు.



ముదిగుబ్బ: అలంకరణలో వేంకటేశ్వరస్వామి

భక్తులతో ఆలయాలు కిటకిట

తలుపుల: ఓబీఆర్‌రోడ్డులోని శ్రీ రామాలయం, బలిజపేటలోని రామాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం తెల్లవారుజామున నుంచి పూజలు చేశారు. రామాలయంలో అర్చకుడు శ్రీ లక్ష్మీనరసింహశాస్త్రి ఉత్తర ద్వారా ప్రవేశం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు సోమవారం ముక్కోటి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనగానపల్లి, తగరకుంట గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కనగానపల్లిలో తిరుమలరాయుడి గుట్టపై వెలసిన వెంకటేశ్వర ఆలయంలోనూ పూజలు జరిగాయి.

ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు

రామగిరి: ముక్కోటి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. రెండు రోజులుగా ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్‌దీపాలతో అలంకరించగా, ఉదయాన్నే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి పంచాయతీల్లోని గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. గంగంపల్లి సమీపంలోని తిరుమల దేవర ఆలయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి కల్యాణోత్సవాన్ని జరిపించి, ఉత్తర ద్వార దర్శనం చేయించారు.



తాడిమర్రి: అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కనగానపల్లి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలోని వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వారి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో స్వామి దర్శనానికి వెళ్లి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని, శ్రీకాళహస్తిలోని ఈశ్వరుని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు దర్శించుకొని పూజలు చేశారు.

వచ్చే ఏడాదికి రూ.3వేల పింఛన్

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం వచ్చే జనవరికి రూ.3వేల పింఛన్ అందించనున్నట్లు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవా రం కుమ్మరవాండ్లపల్లి సచివాలయం–2 పరిధిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్ ఆధ్వర్యంలో పెన్షన్ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది పెరిగిన పెన్షన్ మొత్తం రూ. 2,750 లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. మండలంలో 5,423 పెన్షన్లు రూ.1.50 కోట్లు ప్రతి నెలా 1న లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన 209 పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రకాష్, ఎంపీడీఓ సుధామణి, ఈఓఆర్‌డీ అంజనప్ప, సీనియర్ నాయకులు ఆదినారాయణ, ఇంద్రప్రసాద్‌రెడ్డి, కృష్ణానాయక్, మధుసూదన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఈశ్వరయ్య, భాస్కర్, లలితమ్మ, చలపతినాయక్, ఎంపీటీసీ పుల్లయ్య, శివకుమార్, కుమార్‌రెడ్డి, లోకు, కోఆప్షన్ అల్లాబకష్, వైస్ సర్పంచ్ గంగిరెడ్డి, వెంకటేష్‌నాయక్, రామచంద్ర పాల్గొన్నారు.



నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

రైతు సంక్షేమానికి ఆర్‌బీకేలు

తనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. చివరకు విత్తన వేరుశనగ తీసుకోవాలన్నా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాల వద్ద రోజుల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.

నూతన పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే: అంతకు ముందు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతన పింఛను లబ్ధిదారులకు డబ్బులను ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పంపిణీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, ఏఓ శ్రీహరినాయక్, ఈఓఆర్డీ ఆనందయ్య, సర్పంచులు డి. సరస్వతీ, నాగేంద్ర, ఎంపీటీసీలు రమణమ్మ, హిమధర్ రెడ్డి, ఈశ్వరప్ప, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు కొక్కంటి శ్రీనివాసులనాయుడు, భక్తవత్సలరెడ్డి, నాగభూషణరెడ్డి, సంజీవురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిజాం, గణేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, బాల్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీనివాసులు, తాహీర్, రాజశేఖర్, డీలర్ నరసింహులు, పూలశీనా, రహంతులా పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కనగానపల్లి: చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటలకు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ, తర్వాతా మధ్యాహ్నం 12 గంటలకు మేడాపురంలోనే కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బసంపల్లిలో 2 గంటలకు పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరువుతారు. ఇక సాయంత్రం నాలుగు గంటలకు కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి: కనగానపల్లి ఎస్‌ఐగా హనుమంత రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ అంజనేయులు రాప్తాడుకు బదిలీ కావటంతో, ఆ స్థానంలో కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న హనుమంతరెడ్డిని ఇక్కడ నియమించినట్లు సిబ్బంది తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: మున్సిపాలిటీ అభ్యున్నతికి ప్రత్యేక నిధులు కేటాయించామని అందులో భాగంగానే కూరగాయల మార్కెట్‌లో అధునాతన భవనాల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్‌లో మూడు గదులను సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మార్కెట్‌లో నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ రూ.23 లక్షలతో కూరగాయల మార్కెట్‌లో నూతన గదుల కాంప్లెక్స్‌లను నిర్మించామన్నారు. ప్రస్తుతం మూడు గదులను ప్రారంభించామని తెలిపారు.

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

ధర్మవరం: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న 209 మంది బాధితులకు రూ.84.20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని జబ్బులకు లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకున్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని వైద్యం చేయించుకున్న బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వారు ఖర్చుపెట్టిన డబ్బులను ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ రేగాటిపల్లి సురేష్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బూశెట్టి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జిలాన్‌బాషా పాల్గొన్నారు.



మూడుగదుల కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్–1 సెంటర్ –కార్యకర్త(ఓసీ), రాజేంద్రనగర్–1సెంటర్–కార్యకర్త(బీసీ–బి), శాంతినగర్–2 సెంటర్ –ఆయా(బీసీ–బి), ధర్మవరం రూరల్‌లోని మల్కాపురం–2సెంటర్–కార్యకర్త (ఓసీ), గరుడంపల్లి – కార్యకర్త (ఎస్సీ), మల్లేనిపల్లి–ఆయా (ఎస్సీ), ఓబుళనాయునిపల్లి–ఆయా (బీసీ –డీ), బత్తలపల్లి మండలంలో నెత్తివారంపల్లి – కార్యకర్త (బీసీ–ఎ), ముద్దనపల్లి–కార్యకర్త (ఓసీ), పత్రపల్లి లో మినీ అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ) పోస్టుకు దరఖా స్తు చేసుకోవాలన్నారు. యర్రాయపల్లి–2–ఆయా(ఓసీ), తాడిమర్రి మండలంలో దాడితోట–4–ఆయా(ఓసీ) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 6న సాయంత్రం 5 గంటల్లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

వరిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురంలో రైతు చంద్రకళ పొలంలో వరి పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. అందులో 6.300 కిలోల దిగుబడి వచ్చింది. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ , రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: కుటుంబ సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలోని రాజేంద్రనగర్‌లో సోమవారం జరిగింది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. రాజేంద్రనగర్‌కు చెందిన మస్తాన్ భార్య నాగప్రభ కుటుంబ సమస్యలతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి అందే సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందనలో ఆరు అర్జీలు అందినట్లు హరిప్రసాద్ తెలిపారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న మహమ్మద్ తాజ్ (52) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ప్రభు త్వం తరఫున కుటుంబసభ్యులకు రూ.15 వేలు తక్షణసాయం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆసిఫ్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

అమడగూరు: మండల కేంద్రం అమడగూరు సెంటర్–1లో ఆయా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీ రిజర్వేషన్ అయినందున అర్హులు ఈ నెల 7 లోగా కదిరి ఐసీడీఎస్ పడమర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం కదిరి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అయ్యప్పస్వాముల గ్రామోత్సవం

రామగిరి: అయ్యప్ప మాలధారణతో మానసిక ప్రశాంతత వస్తుందని అయ్యప్ప భక్తులు అన్నారు. సోమవారం చెన్నేకొత్తపల్లి మండలంలోని బసంపల్లిలో అయ్యప్పస్వామి మాలధారులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అయ్యప్పను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పేదలకు నోటీసులు ఇవ్వడం సరికాదు

కదిరి టౌన్: పేదలకు నోటీసులు ఇవ్వడం సరికాదని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబుకు సీపీఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. పట్టణ పరిధిలోని 20 వార్డులో పేదలకు ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని, సర్వే నంబర్ 504లో 2006లో ప్రభుత్వ పేదలకు పట్టాలు ఇచ్చి గృహ నిర్మాణానికి రుణాలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సుబ్బిరెడ్డి, జగన్మోహన్, నాగరాజు, కృష్ణానాయక్, రామ్మోహన్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

ఓడీ చెరువు: మండలంలోని డబురువారిపల్లికి చెందిన డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎద్దుల వెంకటరంగారెడ్డి సోదరుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహారెడ్డి (55) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని మృతుని భార్య, కుమారుడు, కుమార్తెకు ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఎంపీపీ ఫర్వీన్ బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, అగ్రిఅడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ..

నల్లచెరువు: మండలంలోని రమణప్పగారిపల్లి దళితవాడకు చెందిన వీఆర్‌ఏ రమణప్ప (52) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి సోమవారం గ్రామానికి విచ్చేసి, మృతదేహం వద్ద పూలమాలను ఉంచి నివాళులర్పించారు. దహనసంస్కారాలకు రూ.10 వేలు సాయం అందించారు. జెడ్పీటీసీ అనిత భర్త విశ్వనాథ్‌రెడ్డి రూ. 5 వేలు అందించారు. గ్రామంలోని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రూ. 10 వేలు అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అశోక్, కార్యదర్శి రమణప్పనాయుడు, సర్పంచ్ సమీవుల్లా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, డైరెక్టర్ ఆదిమూర్తి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, బీసీ సంఘం నాయకుడు లక్ష్మీపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వీఆర్వో..

గాండ్లపెంట: మండలంలోని గొడ్డువెలగల పంచాయతీ పాలవాండ్లపల్లిలో విశ్రాంత వీఆర్వో రామచంద్రారెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడికి నివాళులర్పించారు.

వ్యక్తికి గాయాలు

అమడగూరు: మండలంలోని చినగానిపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండువారిపల్లికి చెందిన శ్రీరాములుకు గాయాలయ్యాయి. సోమవారం శ్రీరాములు ద్విచక్రవాహనంలో బిళ్లూరు నుంచి వస్తుండగా ఎదురుగా గుర్తు తెలియని కారు ఢీ కొంది. గాయపడిన శ్రీరాములును 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.